# మార్పు

నాల్గు వారాల క్రితం పుట్టింటికెళ్ళిన మా ఆవిడ ఆరోజు వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది. దింపుకోవటానికి బస్ డిపో కెళ్ళాను. బస్ రావడానికి అరగంట పయిచిలుకుగా పడుతుందన్నారు. బుక్‌స్టాల్ దగ్గర పుస్తకాలు చూస్తూ నిలబడ్డాను.

"మిమ్మల్నెవరో పిలుస్తున్నారండీ!" అని నన్ను తట్టి చెప్పాడు ప్రక్కన నిలబడి శృంగార పత్రికల నవలోకిస్తున్న పెద్దమనిషి. అటు చూశాను. గుంటూరు బుకింగ్ దగ్గర కూర్చున్న ఒక యువతినవ్వుతూ నన్ను చెయ్యెత్తి పిలుస్తోంది.

ఎవరా అని ఆశ్చర్యంగా దగ్గరకెళ్ళాను.

ఆమె "గుర్తున్నానా అన్నయ్యా!" అంది నవ్వుతూ.

నన్ను "అన్నయ్యా" అని పిలిచేవాళ్ళు మా బంధువుల్లో ఎవరూ లేరు. ఇంత లీవిగా, నిండుగా నవ్వగలిగిన వాళ్ళు కూడా లేరు. మరి ఆమె ఎవరో గుర్తుకు రావటం లేదు.

"మర్చిపోయావా అన్నయ్యా, నేను సావిత్రిని కదూ!" అంది మళ్ళీ నిండుగా నవ్వుతూ.

సావిత్రి!..... గుర్తుకు వచ్చింది. ఏడు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈనాడు కనిపించింది. అప్పట్లో సావిత్రి సన్నగా పీలగా వుండేది. ఇప్పుడు బాగా వళ్ళు వచ్చింది. లావయింది. మనిషి నిండుగా వుంది. అందుకనే వెంటనే గుర్తుపట్టలేకపోయాను.

వేషధారణలో కూడా చాల మార్పు వచ్చింది. అప్పట్లో వెకిలిగా వుండేది. పమిట జారేసుకుని జడ ముందుకేసుకుని మొగవాళ్లని ఆకర్షించేటట్లు వుండేది. ఇప్పుడు నిండుగా పమిట కప్పుకుని వుంది. పయిగా నేను గ్రహించిన కొత్త విషయం సావిత్రి మెడలో నల్లపూసలు, మంగళ సూత్రాలు వున్నాయి. ఆమె ప్రక్కన ఒక యువకుడున్నాడు. లాల్చీ, పైజమా వేసుకున్నాడు. సిగరెట్టు త్రాగుతున్నాడు.

"ఎవరీతను, భద్రయ్యా?" అని అడిగాను.

"మావారు" అంది సిగ్గుపడుతూ.

సావిత్రి మళ్ళీ పెళ్ళి చేసుకుందన్న మాట! వెరీగుడ్. పడ్డగోడలు పడ్డట్టే వుండవుగా!

సావిత్రికి ఎంత కుదురు వచ్చింది!

సావిత్రి ఆ రోజుల్లో ఎలా వుండేది.....

* * *

అవి నేను బందరు నుండి ఆ వూరుకు క్రొత్తగా ట్రాన్సఫరయిన రోజులు. ఒంటరి గాడ్ని, ఆ వూళ్ళో నాచిన్ననాటి స్నేహితులు రంగారావు, ఖాన్ సర్వే డిపార్టుమెంటులో పని చేస్తున్నారు. ఇద్దరూ ఒకే రూంలో వుంటున్నారు. నేనిలా ట్రాన్సఫరయి ఆ వూరొస్తున్నట్లు వుత్తరం వ్రాయగానే యిద్దరూ స్టేషన్ కొచ్చారు. వాళ్ళరూంకు తీసికెళ్లారు.

వాళ్ళ రూం పెద్దది. మూడో మనిషి ఈజీగా వుండవచ్చు. నన్ను కూడా వాళ్ళతోపాటు వుండిపొమ్మన్నారు. సరే అన్నాను.

నేనా గదిలో దిగిన సాయంత్రానికి ఆ గది ఏ బిల్డింగ్‌లో వున్నది, ఆ బిల్డింగ్ ఓనర్ ఎవరు, అందులో మిగతా భాగాలల్లో ఎవరెవరుంటున్నారు, వాళ్ళ జీవితం ఎలాటిది.... ఈ విషయాలన్నీ చూచాయగా గ్రహించాను.

అదొక వ్యభిచార గృహం. ప్రతి వ్యభిచార గృహానికి ఒక "ఆడ ఓనర్" ఉంటుంది. దీనికీ వుంది. పేరు కాంతమ్మ. దీన్ని "కాంతమ్మ కంపెనీ" అంటారు. ఈ కాంతమ్మ పూర్వం అద్దె యిళ్ళల్లో ఈ వ్యాపారం సాగిస్తూ వుండేది. ఈ వ్యాపారంలో బాగా సంపాదించి డబ్బు బాగా కూడబెట్టిన తర్వాత, అద్దెయిళ్ళల్లో బాధలు పడలేక సొంతంగా ఈ మేడ కట్టించుకుంది. క్రింద భాగంలో తన వ్యాపారం నడుపుతూ, "పై భాగం అద్దెకు" అని బోర్డు పెట్టింది. అందులో అద్దెకుండడానికి చూస్తూ చూస్తూ సంసారులెవరొస్తారు? ఎవరూ రాలేదు. అందుకని ఆ భాగాన్ని నాల్గు గదులుగా మార్చి అద్దెలకు యిచ్చింది. ఎక్కడా రూంలు దొరకని బ్రహ్మచారులూ, ఈ రూంలే కావాలనుకున్నవాళ్ళు వచ్చి చేరారు. మా ఖాన్ వాళ్లు మొదటి రకం కిందకొస్తారు.

విషయం గ్రహింపు అయిన తర్వాత, "ఇదేమిట్రా, ఇలాటిచోట వుంటున్నారు?" అని అడిగాను.

ఖాన్ పకపక నవ్వి, "లైఫ్ గురూ, లైఫ్! అన్ని రకాలు చూడాలిగా. నీకు మంచి మేత. నీ కథలకు ఓ, ప్లాట్లే ప్లాట్లు" అని అన్నాడు.

* * *

రాత్రి పదకొండు గంటలయింది.

మల్లెపూలు, సెంటు కలిసిన వాసన గదిలో గుప్పమనగానే చదువుతున్న నవల మీదనుండి దృష్టి మరల్చాను. ఒక యువతి మా గదిలోకి బాణంలాగా దూసుకు వచ్చింది. రావటమే తలుపు మూసేసి గడియ పెట్టింది. నేను కంగారుపడి లేచి నిలబడ్డాను. నాకంటె కంగారుగా ఆమె గదిలో అటుఇటు తిరుగుతోంది. నాకంతా అయోమయంగా వుంది. ఆమె ఇలా లోపలికి జొరబడి గడియపెట్టడంలో ఉద్దేశంలో ఏమిటో నాకర్థం కాలేదు. తలుపు దగ్గరికెళ్ళి గడియ తీయబోయాను. ఆ పిల్ల విసురుగా వచ్చి నా రెక్కపట్టుకుని లాగి, "అబ్బబ్బ, తలుపు తీయకండి బాబు!" అంది ప్రాధేయపడుతున్నట్లుగా. ఆమె అలా ప్రాధేయపడేసరికి గడియ తీయడం మానేశాను.

కిటికీ దగ్గరకెళ్ళి బయటికి తొంగిచూసి, అది కూడా మూసేసింది.

ఇదెక్కడి ఖర్మరా బాబు అనుకున్నాను. చిరాకుగా, "ఏమిటిది?" అన్నాను ఆమెతో.

"పోలీసులండి బాబు, పోలీసులు "రయిడింగ్" చేస్తున్నారు. వాళ్ల కంటపడితే నన్ను కూడా పట్టుకుపోతారు." అంది మెల్లగా.

పరిస్థితి అర్థమయింది.

వచ్చి కుర్చీలో కూర్చున్నాను. సిగరెట్టు తీసి వెలిగించబోయి, సిగరెట్టు పొగ ఆమెకిబ్బందిగా వుంటుందేమోనని సందేహంగా ఆమె వంక చూశాను.

ఆమె నవ్వి, "ఫర్వాలేదు కాల్చండి" అంది.

వెలిగించాను. ఆమెను పరికించి చూడాలనిపించింది. కాని, సూటిగా చూస్తానికేదో సభ్యత అడ్డొచ్చింది. అందుకని లేచి నిలబడి వంకీకి వున్న లాగు జేబులోంచి వక్కపొడి పొట్లం బయటికి తీస్తూ ప్రక్కచూపులతో ఆమెను చూశాను.

ఇరవై ఏళ్ళుంటాయేమో. మనిషి చామనఛాయగా వుంది. కోలమొగంతో కాటుక కళ్ళు తళతళ మెరుస్తోన్నాయి. అదే మొగానికంతా ఆకర్షణ, వెలుగునిస్తున్నాయేమో! మనిషి లక్షణంగా వుంది. మామూలుగా యిలాటివాళ్ళ మొగంలో కనిపించే వెకిలితనం ఈమె మొగంలో ఎక్కడా కనిపించలేదు.

"వక్కపొడికావాలా?"

నవ్వుతూ తీసుకుంది. నవ్వినప్పుడు తెల్లని పలువరుస మెరిసింది. ఆ నవ్వుకూడా ఠీవిగా వుంది.

ఆమె ఎదుట నేను సిగరెట్టు కాల్చటానికి సందేహించినందుకు, వక్కపొడి ఆఫర్ చేసినందుకు కాబోలు నావంక ఎంతో స్నేహంగా, కృతజ్ఞతాపూర్వకంగా చూస్తోంది.

"వాళ్లేరి?" అంది.

వాళ్ళు అంటే నా స్నేహితులన్నమాట. శనివారం రాగానే వాళ్లు దగ్గర్లో వున్న సొంత ఊళ్ళకు చెక్కేస్తారు. మళ్ళీ సోమవారం వుదయం వస్తారు.

"ఇవ్వాళ శనివారం కదూ! మరి మీరెళ్ళలేదేం?"

నేను మా వూరు పోవాలంటే వంద మైళ్ళు దూరం పోవాలి. అదే చెప్పాను.

"మీరంతకు ముందెక్కడ వుండేవాళ్ళు?"

"బందర్లో!"

తర్వాత నా పేరు, వుద్యోగం, జీతం, అన్నీ అడిగి తెలుసుకుంది.

ఇంతలో, "సావిత్రీ" అని, ఎవరో కిందనుండి కేక వేశారు.

"పోలీసోళ్ళు వెళ్ళిపోయారట్టుంది, వెళ్తానండి. రేపు మళ్ళీ వస్తాను. మీతో పనుంది." అని చెప్పి "ఓ వచ్చే వచ్చే-" అంటూ గడి తీసుకుని పరుగెత్తింది.

మర్నాడు మధ్యాహ్నం 12 గంటలప్పుడు నేను హోటల్లో భోంచేసి వస్తున్నాను. క్రింద సావిత్రి వాళ్ళు సవరాలు బేరాలాడుతున్నారు. నన్ను చూచి సావిత్రి నవ్వింది. నా వెనకాలే పైకి వచ్చింది.

"భోం చేశారండీ!" అంది, నేను తాళం తీస్తూ వుండగా

"ఆహా-"

గుమ్మం వారగా కూర్చుని, "ఏవండీ, కాస్త ఈ కార్డు చదివిపెట్టండి -" అని ఒక పోస్టుకార్డు అందించింది.

ఆ కార్డు మంగళగిరి నుండి వచ్చింది. ఎవరో భద్రయ్య అనే అతను రాశాడు. ఆ వుత్తరం యథాతథంగా యిక్కడ రాయటానికి అదెవరో వచ్చీరాని భాషలో, సర్వ తప్పులతో రాశారు. మొత్తానికి అందులోని విషయం ఇది :

భద్రయ్య అన్నతను మంగళగిరి గవర్నమెంటు టి.బి. ఆసుపత్రిలో వుండి మందుతీసికొంటున్నాడు. అతని రోగం తగ్గేటట్లుగా లేదు. బీడీలు కొనుక్కుందామన్నా, మరింకేదయినా, కొనుక్కు తిందామన్నా అతని చేతిలో ఎర్రని ఏగాని కూడా లేదు. ఆసుపత్రివాళ్ళు యిచ్చే ఆహారం అతనికి సరిపోవటం లేదు. సావిత్రి తన విషయమేమీ పట్టించుకోవటం లేదు; డబ్బు పంపటం లేదు. అసలు తననే వాడొకడున్నాడా చచ్చాడా అనే విషయం కూడా పట్టనట్లుగా వుంది. ఆ కార్డు చూచిన తక్షణం 25 రూపాయలు మనియార్డరు చేయమని రాశాడు.

ఉత్తరం చదవటం పూర్తయ్యే సరికి సావిత్రి కళ్ళల్లోకి నిండుగా నీళ్ల వచ్చాయి. పమిట చెంగుతో అద్దుకుంది.

"డబ్బు పంపటం లేదంటాడా? నన్నిక్కడ తాకట్టు పెట్టి కాంతమ్మ గారి దగ్గర వంద రూపాయలు తీసికెళ్ళి నెల కూడా కాలేదు. అప్పుడే ఆ వంద అయిపోయిందా? నేను పంపడానికి నా దగ్గర ఏం వచ్చింది? ఏరోజు సంపాదన ఆరోజు కాంతమ్మ గారికి బాకీ కింద చెల్లకొట్టుతున్నానాయే!" - ఎంతో బాధతో తనలో తాను అనుకున్నట్లుగా పైకి మెల్లగా అంది.

తాకట్టు పెట్టడమనే మాట వినేసరికి నేను ఉలిక్కిపడ్డాను. సావిత్రిని తాకట్టు పెట్టడమేమిటి? నాకర్థం కాలేదు. ఆమె ఏమయినా పొలమా పుట్రా, నగా నట్రా, కొంపా గోడా - తాకట్టు పెట్టడానికి. మనిషి - ఆడది! మనుషులను కూడా తాకట్టు పెడతారా?

అదే అడిగాను.

"మీకు తెలియదు. ఇదొక పెద్ద వ్యాపారం లెండి! కాంతమ్మ లాంటి డబ్బున్న షావుకారు మాలాటి దిక్కులేని ఆడవాళ్లను తాకట్టు పెట్టుకుని డబ్బు వడ్డీలకిస్తూ వుంటారు" అంది అదేదో సామాన్య విషయం లాగా.

ఓరి దేముడా? ఇదెక్కడి ఘోరంరా బాబు? ఇది-బానిస వ్యాపారం కాదా! ఇదా మన నాగరికత? స్వతంత్ర భారతదేశంలో మన తెనుగాడబడుచు తాకట్టు వస్తువా? ఇదొక పెద్ద వ్యాపారమా? ఈ వ్యాపారం ఆంధ్రదేశపు నడిబొడ్డున అతి నాగరికమైన ఒకానొక నగరంలో అవిచ్ఛిన్నంగా, స్వేచ్ఛగా సాగిపోతుందా? పుణ్య భారతనారీ, నీ కెన్ని ఆగచాట్లు! నేను పూర్తిగా చలించిపోయాను. నాకళ్ళల్లోకి నీళ్ళు వుబికాయి.

సావిత్రి చెప్పిన మిగతా వివరాలను బట్టి నేనీ కింది విషయాలను గ్రహించాను.

భద్రయ్య అనేవాడు సావిత్రిని కాంతమ్మ అండ్ కంపెనీలో వంద రూపాయలకు తాకట్టు

పెట్టాడు. అసలు వంద. వడ్డీ పాతిక. మొత్తం నూటపాతిక రూపాయల బాకీ సావిత్రి తీర్చాలి. రోజూ తను సంపాదించే దాంట్లో తన భాగం క్రింద వచ్చే మొత్తం ఈ బాకీ కింద కాంతమ్మకు జమ కట్టాలి. బాకీ చుప్తాగా తీరిపోవాలంటే అయిదారు నెలలు, ఒక్కోసారి సంవత్సరం కూడా దాటుతుంది. అంతకాలమూ ఆ కంపెనీలోనే వాళ్ళ కస్టడీలోనే వుండాలి. మరెక్కడికీ పోకూడదు.

"ఒకవేళ మధ్యలో మీరు పారిపోతే!" వెర్రివెంగళాయి లాగా అడిగాను.

సావిత్రి నవ్వింది. "మేము మరీ అంత నీతి తక్కువ పని చెయ్యం గదండీ! ఒకవేళ ఎవరయినా చేసినా, వూరూర కాంతమ్మగారి పరిచయస్థులుంటారు కదండీ, తెల్లారేపాటికి మళ్ళీ తెచ్చి యిక్కడ పడేస్తారు. అప్పుడు వాళ్ళు పడేపాట్లు కుక్కలు కూడా పడవు. అందుకనే ఎవరూ తెలివితక్కువగా పారిపోరు" అంది.

తమ్ముళ్ళ చదువుల కోసమో, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు పేరంటాల కోసమో, తల్లితండ్రులకు వైద్యం కోసమో, ప్రియుళ్ల సరదాల కోసమో అవసరమైన డబ్బుకోసం ఇలా తాకట్టు వుండి ఎక్కువ మొత్తంలో డబ్బు అప్పు తీసుకుని అవసరాలు గడుపుకుంటూ వుంటారు ఈ జీవితానికలవాటు పడ్డవాళ్ళు.

"అవునూ, అప్పు యిచ్చేటప్పుడు ఎంతడిగితే అంత యిస్తుందా? ఎవరికెంత అప్పు యివ్వవచ్చును అనేది ఎలా నిర్ణయిస్తుంది?" అని అడిగాను.

సావిత్రి పకపక నవ్వింది. ఆ నవ్వు ఎంతో స్నేహపూరితంగా వుంది. "బలేవారండి! బలే బలే ప్రశ్నలడుగుతాన్నారు. నిజమే, ఎవరెంత అడిగితే అంత యివ్వదు, తాకట్టుగా వుండే మనిషిని బట్టి యిస్తుంది. మనిషి మంచి వయస్సులో వుండి అందంగా, ఆరోగ్యంగా వుంటే ఎక్కువ మొత్తం యిస్తుంది. లేకపోతే తక్కువ యిస్తుంది. కొంతమంది రోగాలతో కుళ్ళిపోయినా పయికి పచ్చగా బాగానే వుంటారు. అందుకని కంపెనీ డాక్టరుచేత ముందుగా పరీక్ష చేయిస్తుంది. బాగా ఎక్కువ రోగాలుంటె అసలు అప్పే యివ్వదు. పొమ్మంటుంది. ఎందుకంటే రోగాలెక్కువుగా వున్నవాళ్ళు కంపెనీలో వున్న కాడ్నుంచి ఒక విధంగా రాదులెండి-"

అయ్యబాబోయ్ - మెడికల్ టెస్టు! డాక్టరు సర్టిఫికెట్!! - అంతా భీమా వ్యాపారం లాగే వుందే!

"డాక్టరు దొంగ సర్టిఫికేట్లు యిస్తే-"

సావిత్రి తెలివి కలది. నేనే వుద్దేశంతో అన్నానో అర్థం చేసుకుంది.

"ఎవడయినా కుర్రడాక్టరయితే మీరన్నట్లు కాస్త సరసం చేసి వున్నరోగాలు కప్పిపుచ్చి ఆరోగ్యంగానే వుందనవచ్చును. కాని కాంతమ్మ గారికి కొంపలు ముంచే తెలివితేటలున్నాయి. ఇలాటివన్నీ ముందుగానే ఆలోచించే కంపెనీకి ఒక ముసలి డాక్టర్ని పెట్టింది-" అంది నవ్వుతూ.

ఇంతలో కిందనుండి కాంతమ్మ కంఠం కర్ణకఠోరంగా వినిపించింది.

"ఏవే సాయిత్రీ! ఎక్కడ జేరావ్? రూంల్లో దూరటం నేర్చావే? రూంలో ఎవరున్నారు? రంగారావు వాళ్ళు లేరుగా? ఆ కొత్తాయనేంటి? ఈ కొత్తాయన అసాధ్యుడు లాగా వున్నాడే - అని అరుస్తుంది.

"వస్తానండి. ఇవాళ ఆదివారం కదూ! మధ్యాహ్నం నుండే మేం రెడీగా వుండాలి. మ్యాట్నీ

సినిమాలకు టిక్కెట్లు దొరకని వాళ్ళు యిక్కడికి వస్తూ వుంటారు. అన్నట్లు రేపు కాస్త వుత్తరం రాసిపెడతారా?" అని అంటూ హడావుడిగా కిందికి పరుగెత్తింది.

.... తర్వాత తర్వాత సావిత్రి తరచూ మా గదికి వస్తూ వుండేది. భద్రయ్యకు నాచేత వుత్తరాలు రాయిస్తూ వుండేది. తన సంగతులన్నీ చెప్తుతూ వుండేది. నేనంటే ఎంతో అభిమానంగా వుండేది. ఏ విధమైన అరమరికలు లేకుండా నాతో తన విషయాలన్నీ మాటాడుతూ వుండేది. ఒకసారి, తనీ కుళ్ళు జీవితంలోకి ఎలా అడుగుబెట్టింది, ఎలా ఈ వూబిలోకి జారిపోయిందీ చెప్పింది.

ఇలాటివాళ్ళ కథలన్నీ దాదాపు ఒకేమాదిరిగా వుంటాయి. వయస్సు మళ్ళినవాడూ, త్రాగుబోతు అయిన వాడికి రెండో పెళ్ళామో, మూడో పెళ్ళామో అవటం, వాడి చేతుల్లో రోజా చావుదెబ్బలు తినటం ఎవరితోనో (సావిత్రి విషయంలో భద్రయ్యతో) పరిచయమేర్పడడం, వాడితో లేచి రావడం - ఇంతవరకూ మామూలు కథే!

కాని, యిక్కడ్నుంచి సావిత్రి ఇలా పడుపుగత్తెగా తయారవటంలో మిగిలిన వారికి భిన్నమైన మనస్తత్వం నాకు కనిపించింది. భద్రయ్యతో లేచిపోయి వేరే వూరు వెళ్ళిన తర్వాత కొన్ని రోజులకు యిద్దరి దగ్గర డబ్బు అయిపోయింది. భద్రయ్య పనికొరకు ఎంత ప్రయత్నించినా ఎక్కడా దొరకలేదు. టీ నీళ్ళు తాగి వేరుశనక్కాయలు తిని రోజులతరబడి వస్తులున్నారు కాని ఒకరినొదిలి ఒకరు పారిపోలేదు. ఆకలితో వాళ్ళ కడుపులు మాడినా వాళ్ళ ప్రేమ, ఆకర్షణా ఎండిపోలేదు. ఈ పరిస్థితుల్లో భద్రయ్యకొకసారి జ్వరమొచ్చింది. అతనికి పెళ్ళాం, పిల్లలు వున్నారు. పెళ్ళానికొక ఎకరం పొలం కూడా వుంది. పెళ్లాం పిల్లలను వదిలేసి తనతో వచ్చేసి, వస్తులతో నానా అవస్థలు పడుతూ కూడా తననే కనిపెట్టుకుని వున్న ప్రియుని ప్రేమాభిమానాలకు సావిత్రి హృదయం కరిగిపోయింది. జ్వరంతో బాధపడుతున్న వాడికి కాఫీనీళ్లు పోస్తానికయినా చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. వంటిమీద వున్న నగా నట్రా అంతకు ముందే అయిపోయింది. చిన్నమెత్తు బంగారం లేదు. రెక్కల కష్టం చేసి పావలా డబ్బులు సంపాదిద్దామన్నా ప్రతిచోటా తన మానానికి అగ్ని పరీక్ష అయిపోయింది. ఈ మొగరాయుళ్ళ కళ్ళకు తన వళ్ళు, వయస్సు, అందమే కనిపించాయి.

ఈ పరిస్థితుల్లో సావిత్రికి కనకం అనే పేరు గల ఒక బడి పంతులమ్మతో పరిచయం ఏర్పడింది. ఈ కనకాన్ని సావిత్రి ఎంతో ప్రాధేయపడుతూ రెండు రూపాయలు అప్పు అడిగింది. అప్పు యివ్వలేను కాని, కావాలంటే రెండు రూపాయలు సంపాదించే మార్గం చెప్తుతానంది. సావిత్రి ఒప్పుకుంది. మొట్టమొదటిసారిగా కనకం యింట్లో ఒక రసికుడుకి రెండు రూపాయల కోసం తన్ను అర్పించుకుంది.

ఆ రెండు రూపాయలతో భద్రయ్యకు అప్పటికి కావల్సినవి సమకూర్చింది. అప్పటికి భద్రయ్యకు జ్వరం తగ్గినా తరచుగా ఏదో ఒక రోగం వస్తూ వుండేది. రాను రాను అతని పొట్టకోసం, తన పొట్టకోసం తన వళ్ళు అమ్ముకోవటం తప్పనిసరయింది. ఈ జీవితానికిద్దరూ అలవాటు పడిపోయారు.

సావిత్రి సంపాదించే డబ్బులతో భద్రయ్య జల్సాలు చేస్తూ రోజా సావిత్రిని తన్నటం మొదలు పెట్టాడు. ప్రియుడిచేతుల్లో తన్నులు తినడం కూడా గొప్ప విషయంగా భావించింది సావిత్రి. ఇలా

వుండగా భద్రయ్యకు క్షయ రోగం వచ్చింది. ఎక్కడి డబ్బూ ఈ రోగానికే సరిపోయేది. డాక్టరు మంగళగిరి టి.బి. ఆసుపత్రిలో జేర్పించమని సలహా యిచ్చాడు. ముందు చేతిలో కనీసం ఒక వంద రూపాయలయినా వుంటేగాని పని జరిగేటట్లు లేదు. అందుకని ఈ వూరొచ్చి ఈ కాంతమ్మ కంపెనీలో తాకట్టుకు వుండి ఆ డబ్బు యిచ్చి భద్రయ్యను పంపింది. ఇంకా డబ్బు పంపమని మంగళగిరి నుండి భద్రయ్య ఉత్తరాలు రాస్తున్నాడు.

ఈ కథ విన్న తర్వాత నాకు సావిత్రి మీద ఒక విధమైన స్నేహభావం కలిగింది. సావిత్రిని ఈ స్థితికి తీసుకొచ్చిన ప్రేమ ఎంత గొప్పదో ఆమె అంటే జాలి కూడా కలిగింది. ఒక మొదటి తేదీన జీతాలు తీసుకొని ఆమెకు కొద్దిగా డబ్బు యివ్వబోయాను. సావిత్రి తీసుకోలేదు. ఎంత బలవంతం చేసినా ఒప్పుకోలేదు. ఆమె అంత అభిమానవతి అని నేను వూహించలేదు. ఆమె అంటే నాకంతకు ముందేర్పడిన గౌరవభావం ఈ సంఘటనతో ఇంకో స్థాయికి పెరిగింది.

ఆమె యెడల కనబరుస్తున్న జాలి, అభిమానం ఆమెను కదిలించింది కాబోలు. నన్ను ఆ రోజునుండి, "అన్నయ్యా!" అని పిలవడం మొదలుపెట్టింది...

.... ఇది జరిగి దాదాపు ఏడు సంవత్సరాలయింది. ఆ తర్వాత నేను ఏవేవో వూళ్ళు ట్రాన్సఫరయ్యాను. పెళ్ళి చేసుకున్నాను. ముగ్గురు బిడ్డల తండ్రినయ్యాను. సావిత్రి ఏమయిందో కూడ తెలియదు. ఆమె సంగతి పూర్తిగా మర్చిపోయాను.

ఏడు సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈరోజు విజయవాడ బస్‌స్టాండ్‌లో కనిపించింది. మళ్ళీ పెళ్ళి చేసుకుంది. ఒకరికి యిల్లాలయి లక్షణంగా కాపురం చేసుకుంటుంది. నాకెంతో ఆనందంగా వుంది.

"కాఫీ త్రాగి వద్దాం రా సావిత్రి. రండి-" అని వాళ్ళిద్దర్నీ కాఫీకి ఆహ్వానించాను.

"మనం పోదాం పద అన్నయ్యా! ఆయన సామాను చూస్తూ వుంటారులే!" అంది.

వాళ్ళ సామాను, చిన్న సూటుకేసు, ఒక ప్లాస్టిక్ బుట్ట, ఎయిర్ బేగు వున్నాయి.

సావిత్రి భర్త, "మీరెళ్ళి రండి సార్!" అని అన్నాడు.

కాంటీన్‌లోకి వెళ్ళాం.

కాఫీ త్రాగుతూ, "ఆఁ యిప్పుడు చెప్పు సావిత్రి, భద్రయ్య ఏమయ్యాడు? అతనికి జబ్బు నయమయిందా?" అని అడిగాను కుతూహలంగా.

సావిత్రి దిగులుగా నవ్వింది.

"నయమయింది. ఇప్పుడు హాయిగా సొంత వూళ్ళో పెళ్ళాం బిడ్డలతో కాపురం చేసుకుంటూ పొలం చూసుకుంటున్నాడు."

"అదేమిటి?"

"ఏముంది. నేను అష్టకష్టాలు పడుతూ మానాన్ని అమ్ముకుని రెండు సంవత్సరాలు కష్టపడి అతనికి డబ్బు పంపాను. జబ్బు నయమయింది. యిద్దరం కలిసి వుండవచ్చు కదా అనుకున్నాను. "నాతో మాటమాత్రమయినా చెప్పకుండా ఆసుపత్రి నుండి అటునుండి అటే వెళ్ళిపోయాడు."

ఎంత దారుణం! లోకంలో కృతజ్ఞత యింకెక్కడ వుంది?

జాలిగా సావిత్రి వంక చేశాను. తల వంచుకుంది.

"సరే, పోతే పోయాడు. అదీ ఒకందుకు నీ మంచికే! ఆ పాత జీవితం మానేసి చక్కగా పెళ్ళిచేసుకున్నావు. లక్షణంగా కాపురం చేస్తున్నావు.... నా కెంద ఆనందంగా వుందో తెలుసా సావిత్రి! ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈనాడు నిన్నిలా చూస్తున్నందుకు. ఆఁ- అన్నట్లు మీ ఆయన ఏం జేస్తుంటాడో?" అని అడిగాను.

కొద్దిసేపు సావిత్రి ఏమీ మాటాడలేక పోయింది.

నా చేయింమీద చేయివేసి, "అన్నయ్యా" అంది, వణుకున్నత కంఠంతో

"ఏం సావిత్రి! ఏమిటి?"

తల ఎత్తి చూసింది. కనుకొలుకుల్లో కన్నీరు నిలిచింది. భద్రయ్య ఆలోచనలు మనసును కలచివేస్తున్నాయి కాబోలు.

"భద్రయ్య పోతే పోయాడ్లే సావిత్రి!"

"కాదన్నయ్య, ఆ భద్రయ్యను గురించి ఆలోచించటం బాధపడటం ఎప్పుడో మానేశారు."

"మరి. ఇతను నిన్ను సరిగా చూడటం లేదా?"

ఆ మాటకు సావిత్రి పకపక నవ్వింది. ఆ నవ్వు అదురుకు కనుకొల్లుకుల్లో నిల్చిన కన్నీరు చెంపల మీదకు జారాయి. పమిట చెంగుతో తుడుచుకుంటూ మళ్ళీ నవ్వింది.

"నాకు పెళ్ళి కాలేదన్నయ్యా!"

నాకు మతిపోయినట్లనిపించింది.

సావిత్రి ఏమిటంటుందో నాకర్థం కాలేదు.

"ఏమిటి సావిత్రి నువ్వనేది?"

"అవునన్నయ్యా! నేను ఎలా వున్నాను? అచ్చం సంసార స్త్రీలాగా లేను? అతను నా భర్త అన్నమాట. యిద్దరం వూరెళ్ళుతున్నట్లుగా సామాను తీసుకుని బస్‌స్టాండింగ్‌కొచ్చాం. గుంటూరు బుకింగ్ దగ్గర కూర్చుంటాం. ఈ బస్‌స్టాండింగ్‌లో కాస్త అందంగా వున్న ఆడది కనిపిస్తే చాలు మొగపక్షులు జేరుతాయి, వికిలిస్తాయి, సకిలిస్తాయి. అనువుగావున్న పక్షిని చూసి నేను నవ్వుతాను! కొంటెచూపులు చూస్తాను. అంతే. ఇక ఆపక్షి అక్కడే గిరిగిర గింగిరాలు కొట్టుకుంటూ తిరుగుతూ వుంటుంది. ఇదిగో, ఆ ప్రక్క కాఫీతాగుతున్నాడు చూడు సిల్కు షర్టు. నీవు రాకముందు అరగంట నుంచి నాచుట్టూ తిరుగుతున్నాడు. మనం కాఫీకి రావటం చూచి తనూ వచ్చాడు. చూడు, చూడు ఎలా వెధవచూపులు చూస్తోన్నాడో!"

నేనతని వంక చూడగానే గాభరాపడి చూపుమార్చి ఏదో చూడటం మొదలుపెట్టాడు.

సావిత్రి మళ్ళీ ఇలా అంది.

"ఈ బ్రోకర్ గాడు ఏ కాఫీకో వెళతాడు. గింగిరాలు కొడుతున్న ఈ పక్షిగాడు నా ప్రక్కకు

జేరుతాడు. ధైర్యమున్నవాడయితే తనే మాటాడిస్తాడు. లేకపోతే నేనే ముందు పలకరిస్తాను. "తెనాలి బస్సు ఎక్కడ ఆగుతుందండి" అంటాను. అలా మాటలు కలుస్తాయి. ఈ బ్రోకర్‌గాడ్ని మావారు అని చెప్తుతాను. (నీకు చెప్పినట్లుగా). ఆయన జబ్బు మనిషి. ఆయనకి పిల్లలు మీద మోజు. అందుకని నాకిష్టమైన వాళ్ళతో నేను తిరగటానికి ఆయన ఏమీ అభ్యంతరం చెప్పడు అని చెప్తుతాను. ఆ లోపల ఈ బ్రోకరుగాడు కాఫీ తాగి వస్తాడు. ముగ్గురం కలిసి ఈ మొగపక్షి రూంకో, యింటికో, వూరికో లేక లాడ్జింగ్‌కో (మొగపక్షి వీలునుబట్టి) పోతాం..... ఈ బ్రోకరుగాడికి కాఫీ, టిఫిన్, భోజనం పెట్టించిరోజుకు రెండు రూపాయలు కూలి యివ్వాలి. నా మొగుడిగా వ్యవహరించినందుకు. ఒక్కోసారి వీడే ఎవర్నో మాటాడి తీసికొస్తూ వుంటాడు" అని చెప్పి, "ఎలా వుంది ఈ పద్ధతి?" అని అడిగింది.

నేను నవ్వి, "బాగానే వుంది!" అన్నాను.

"ఈ మధ్య పోలీసులు నిక్కచ్చిగా వుండేసరికి కంపెనీలన్నీ మూతపడ్డాయి. ఈ కంపెనీల జనమంతా ఇలా బస్సుస్టాండు మీద, రైలు స్టేషన్లమీద పడ్డాం. ఇదొకక్రొత్తపద్ధతి. దీని మూలంగా మాకు చాలా లాభాలున్నాయి. పోలీసుల బెడద వుండదు. సంపాదనలో వాళ్ళకు వాటాలు వుండవు. ఫామిలీ ఆడదానిలాగా కనిపిస్తే మొగవాళ్ళ ఆకర్షణ ఎక్కువ. ఈ పమిట, నల్లపూసలు, సూట్‌కేసు చూస్తే ఎవరూ బజారు సరుకనుకోరు. మొగవాళ్ళకి కూడా ఈ పద్ధతి మూలంగా చాలా సౌకర్యాలున్నాయి. బ్రహ్మచారులయిన స్టూడెంట్ల రూంలకు చుట్టాలులాగ రిక్షాదిగి వెళ్ళవచ్చును. పెళ్లాలను కనటానికి పుట్టిళ్ళకు పంపించిన మొగవాళ్ళు ప్రక్కయిళ్ళ వాళ్ళకు మాచుట్టాలు తిరుపతి వెళుతూ, దిగారని చెప్పవచ్చును. లాడ్జింగ్‌లకు వెళ్ళితే ఫామిలీవాళ్ళు అనుకుంటారు. ఎవరూ అనుమానించటానికి ఆస్కారం వుండదు. రెండు మూడు రోజులు నిర్భయంగా వాళ్ళూ మేమూ గడపవచ్చును. మాకు భోజనం గడిచిపోతుంది. ఈ మొగపక్షులే కారియర్లు తీసికొస్తారు. అవసరమయితే నేనే వంటచేస్తాను...."

"ఇదొక టెక్నిక్ అన్నమాట!"

"కాలం మారిపోతూవుంది కదా! పద్ధతులు కూడా మారుతాయి. పూర్వంలాగా సింగారించుకుని మల్లెపూలు పెట్టుకుని గుమ్మాల్లో నిలబడనక్కర్లేదు."

"కానీ, నీవుమాత్రం మారలేదు సావిత్రి!" అన్నాను జాలిగా, దిగులుగా.

కొన్ని క్షణాలు సావిత్రి ఏమీ మాటాడలేక పోయింది. తర్వాత బాధగా, బరువుగా "మా బతుకులకు ఇలా వెళ్ళమారిపోవాల్సిదే! మార్పు కూడానా!" అంది.

నిజమే వీళ్ళ జీవితాలకు మార్పు అంటూ ఉండదా? ఇక వీళ్ళకు మంచిరోజులంటూ రావా?

- ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

★